క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మృతి చెందిన కనకం (ఫైల్)

లక్కవరపుకోట: మండలంలోని మార్లాపల్లి గ్రామానికి చెందిన లెక్కల కనకం(40) ప్రమాదవశాత్తు గాయపడి విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై నవీన్‌పడాల్ తెలిపారు. ఈ నెల 7వ తేదీన గ్రామంలో నడుస్తూ సీసీ రోడ్డుపై ఒక్కసారిగా పడిపోవడంతో తలకు తీవ్రగాయమైంది. దీంతో కుటుంబసభ్యులు, గ్రామస్తుల సహకారంతో ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు.అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ కూడా పరిస్థితి కుదుటపడకపోవడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య రామలక్ష్మితో పాటు 5వ తరగతి,3వ తరగతి చదువుతున్న పాప, బాబు ఉన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

రేగిడి : ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి సోహినీ రాఘవ్ గర్భిణులకు సూచించారు. పీహెచ్‌సీకి గురువారం వచ్చిన 24 మంది గర్భిణులకు ప్రధానమంత్రి మాతృ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణుల బరువు, ఆరోగ్యం తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం రేగిడికి చెందిన సాయిరాం భక్తులు సమకూర్చిన పౌష్టికాహారాన్ని గర్భిణులకు అందించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుందరేశ్వర్, హెచ్‌వీ పుష్ప, హెల్త్ సూపర్‌వైజర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ఎన్టీఆర్ వైద్య సేవలు

రాజాం : ప్రమాద బాధితులకు, పేదలకు సకాలంలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలు అందిస్తున్నామని ఉమ్మడి విజయనగరం జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవ పథకం మేనేజర్ దూబ రాంబాబు అన్నారు. రాజాంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవలపై ఆయన గురువారం ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి విజయనగరం జిల్లాలో 60,129 మందికి ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ సేవలు అందించామన్నారు. మొత్తం 37 ఆస్పత్రుల ద్వారా ఈ సేవలు విస్తృతం చేశామన్నారు. జిల్లాలో ఈ వైద్య సేవలు నిమిత్తం రూ.8కోట్లు ఖర్చు చేసినట్టు చెప్పారు.

ఉపాధి వేతనదారులకు శిక్షణ

బొబ్బిలి రూరల్: ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులను ఏ విధంగా చేయాలన్న అంశాలపై వేతనదారులకు ఏపీఓ లక్ష్మీపతిరాజు శిక్షణ ఇచ్చారు. మండలంలోని కింతలివానిపేట గ్రామంలోని చెరువు వద్ద వేతనదారులతో గురువారం సమావేశం నిర్వహించారు. చేపల పెంపకానికి వినియోగించే చెరువుల్లో గట్ల పటిష్టతతో పాటు చెరువు చుట్టూరా నడక మార్గం, పచ్చదనం కనువిందు చేసే పద్ధతిలో పనులను చేయాల్సి ఉంటుందన్నారు. రైతుల తోటల్లో చేసే వివిధ పనులపై వేతనదారులకు శిక్షణ ఇస్తూ అవగాహన కల్పించారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹124	₹218	₹228

సంతలో సంక్రాంతి సందడి

- మట్టి కుండలకు డిమాండ్
- పొట్టేలు, నాటుకోడి ధరలు పైపైకి


సంతలో నాటుకోడి విక్రయాలు

రాజాం : మకర సంక్రాంతి పండగ రానే వచ్చింది. మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్న ఈ పండగ వాతావరణం అన్నిచోట్ల స్పష్టంగా కనిపిస్తుంది. పట్టణాల్లో షాపులన్నీ రద్దీగా కనిపిస్తున్నాయి. పండగకు అవసరమైన ప్రధాన వస్తువుల ధరలు ఈ ఏడాది పెరిగాయి. ప్రతీ గురువారం రాజాంలో జరిగే వారపు సంత ఈ గురువారం పండగ సంత కావడంతో పెద్ద ఎత్తున జరిగింది. క్రయ విక్రయాలు అధికంగా జరిగాయి. సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది కొనుగోలుదారులు, విక్రయదారులు సంతలో కనిపించారు. చాలా రోజులు తరువాత ఈ సంత పెద్ద ఎత్తున కనిపించడం విశేషం.

మట్టి కుండలకు డిమాండ్

ఇత్తడి, స్టీలు, ప్లాస్టిక్ రంగ ప్రవేశంలో మట్టి కుండలు, కడవలు, వెదురు బుట్టలు కనమరుగౌతున్నాయి. పండగ సమయాల్లో వీటి అవసరం చాలా ఎక్కువ ప్రధానంగా మట్టి కడవల్లో పాలు పొంగించడం, వెదురు బుట్టల్లో దేవున్ని ఉంచడం చాలా కుటుంబాల్లో ఆనవాయితీ. ఈ సందర్భంగా వీటి ధరలు ప్రస్తుతం పెరిగాయి. చిన్నపాటి మట్టి కడవ ధర రూ.100లు దాటి పలికింది. వీటితో పాటు వెదురు బుట్టలు, మట్టి హుండీలు, దీపపు ప్రమిదలు ఎక్కువగా అమ్ముడయ్యాయి. వెదురు బుట్ట ధర రూ.50ల నుంచి పలుకుతుంది. పెద్ద ఎత్తున వీటి విక్రయాలు రాజాం సంతలో జరిగాయి.

కొండెక్కిన కోడి ధర

గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా లభించే నాటు కోడి ఇప్పుడు కొనాలంటే గగనమౌతుంది. కనుమ రోజున వీటిని ఎక్కువగా గ్రామాల్లో వినియోగిస్తున్నారు. కిలో బరువు తూడే కోడి పుంజు ధర రూ.800లు దాటి పలుకుతుండగా, కోడి పెట్ట ధర రూ.600లు పలుకుతుంది. ఇవి కూడా చాలా తక్కువగా ఈ ఏడాది సంతలోకి వచ్చాయి. నాటు కోడి ధర బాగా పెరగడంతో వీటి పెంపకాలు చేసే గ్రామీణ రైతులకు ఈ పండగ కలసివచ్చింది.

రూ.15 వేలపైనే గొర్రెల ధరలు

సంక్రాంతి అనగానే గుర్తుకు వచ్చే పండగ కనుమ. ఈ ఏడాది ఈ పండగకు ముందునుంచే చాలా గ్రామాల్లో రైతులు గొర్రె పొట్టేళ్ల, మేకపోతులు కొనుగోలు చేసుకున్నారు. రాజాంలో సంతలో వీటి విక్రయాలు అధికంగా జరిగాయి. వందలాది మంది రైతులు గొర్రెలు, మేకలు ఈ సంతలో విక్రయించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ దఫా సంతలో గొర్రెల విక్రయాలు చేసారు. 12 కిలోలు పైబడి ఉన్న గొర్రె, మేకపోతులు ధర రూ.15 వేలు వరకూ పలుకుతుంది. మార్కెట్‌లో గొర్రె మాంసం ధర రూ.1000లు ఉండడంతో ప్రస్తుతం పండగ సందర్భంగా వీటి ధర కొండెక్కింది. ధరలు పెరిగినా కొనుగోలుదారులు మాత్రం వెనుకంజ వేయడం లేదు.

నేడు రామతీర్థంలో ముక్కోటి ఏకాదశి పూజలు

- ఉత్తర ద్వారం నుంచి స్వామివారి దర్శనం
- గిరిప్రదక్షిణ చేయనున్న భక్త జనం
- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవస్థానం అధికారులు


స్వామివారి ఉత్సవ విగ్రహాలు

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు ముస్తాబైంది. స్వామివారి ఉత్తర ద్వార దర్శనం, మెట్లోత్సవం, గిరి ప్రదక్షిణ కార్యక్రమాలు నిర్వహించడానికి ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఒకే రోజు గిరిప్రదక్షిణ, మెట్లోత్సవం నిర్వహించడం వల్ల అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది. ఉదయం 3గంటలకు స్వామివారికి ఆరాధన, 4గంటలకు తిరుప్పావై సేవాకాలం, మంగళాశాసనం, తీర్థగోష్ఠి నిర్వహించనున్నారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ శుక్రవారం వేకువ జామున 5గంటలకు స్వామివారి ఉత్తర ద్వార దర్శనం కార్యక్రమాన్ని జరపనున్నారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి గ్రామంలో తిరువీధి నిర్వహిస్తారు. పవిత్రమైన కొండ మెట్లను శుభ్రపరిచి శిఖరంలో కొలువై ఉన్న శ్రీ కోదండరామస్వామివారి దర్శన భాగ్యం కల్పిస్తారు. నీలాచలం కొండపైకి వెళ్లేందుకు ఉన్న మెట్ల వద్ద వందలాది మంది భక్తులు, కళాకారులతో మెట్లోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. గిరి ప్రదక్షిణ చేసే భక్తులకు మజ్జిగ, మంచినీరు, ప్రసాదాల పంపిణీకి ఆలయ సిబ్బంది, దాతలు సిద్ధమవుతున్నారు. భక్తుల రద్దీ దష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నెల్లిమర్ల పోలీసులు కొండ చుట్టూ బందోబస్తు నిర్వహించనున్నారు.

ముక్కోటి ఏకాదశికి ముస్తాబు


ఆలయంలో వెంకటేశ్వరస్వామి

రాజాం : మండలంలోని అంతకాపల్లి గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానంకు చెందిన వేంకటేశ్వర స్వామి ఆలయం ముక్కోటి ఏకాదశి పూజలకు సిద్ధమైంది. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని గత రెండు రోజులుగా ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లును టీటీడీ ఉద్యోగులు చేపడుతున్నారు. గురువారం అర్ధరాత్రి దాటిన నుంచే భక్తుల దర్శనాలకు అనువుగా ఏర్పాట్లు చేసారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఆలయం ప్రారంభం నుంచి ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం అర్ధరాత్రి 12.05 గంటల నుంచి సుప్రభాత సేవ 12.30 గంటల నుంచి 2.30 గంటల మధ్య స్వప్న తిరుమంజనం, తోమాల సేవ, అర్చన, మొదటి గంట, 2.30 గంటల నుంచి 3 గంటల వరకూ గోపూజ, ఉత్తర ద్వార పూజ, ఉదయం 3 గంటల నుంచి ఉత్తర ద్వారా దర్శనం జరగనుంది.

నేడు ఉత్తర ద్వార దర్శనం

బొబ్బిలి: పట్టణంలోని కంచరవీధిలో వేంచేసి ఉన్న భూనీలా సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఉత్తర ద్వార దర్శన కార్యక్రమాన్ని చేపట్టనున్నామని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 5.30 గంటలకు ప్రారంభమయ్యే ఉత్తర ద్వార దర్శనాన్ని భక్తులంతా వీక్షించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రియల్ ఎస్టేట్‌లో రిజర్వు స్థలాల పరిశీలన

బొబ్బిలి: పట్టణంలోని పాత బొబ్బిలి దారిలో వెలుస్తున్న రియల్ వెంచర్‌లో మున్సిపాలిటీకి కేటాయించిన స్థలాన్ని విక్రయించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు అధికారులతో కలసి గురువారం పరిశీలించారు. టీపీఓ, ఆర్ఐ, సర్వేయర్‌లను తీసుకుని మొత్తం వెంచర్ ఎంత? మున్సిపాలిటీకి కేటాయించింది ఎంత? విక్రయాలు ఎంత మేర జరుగుతున్నాయన్న వివరాలను నమోదు చేసుకున్నారు. మరోసారి పరిశీలన చేసి చర్యలు తీసుకుంటామని చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొబ్బిలి రూరల్: డివిజన్ పరిధిలోని మక్కువ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతు పనులు చేపడుతున్న నేపథ్యంలో మండలంలోని కొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో శుక్రవారం అంతరాయం ఏర్పడుతుందని ఈఈ అనంతరావు తెలిపారు. నారశింహునిపేట సబ్‌స్టేషన్, కలవరాయి ఫీడర్‌ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు కొత్తవలస విద్యార్థిని ఎంపిక


జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన పుష్పితగౌడ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తవలస: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కె.పుష్పితగౌడ్ జాతీయ స్థాయి 68వ క్రికెట్ పోటీలకు అండర్-17 విభాగంలో ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం సీహెచ్.ఈశ్వరరావు గురువారం తెలిపారు. డిసెంబర్ నెలలో జరిగిన స్కూల్‌గేమ్స్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ఎంపికైన డిసంబర్-15వ తేదీన భువనేశ్వర్, రాజస్థాన్ జట్లతో ఆడి సెమీఫైనల్ లో పంజాబ్ జట్టుతో తలపడి మూడు జట్లతో ఆడి మొత్తంగా 252 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచినట్లు హెచ్‌ఎం తెలిపారు. జాతీయ స్థాయి జట్టుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఇద్దరు ఎంపిక కాగా ఇందులో కొత్తవలస హైస్కూల్‌కు చెందిన పుష్పితగౌడ్ ఒకరు కావడం విశేషమన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థినిని శాలువాతో సన్మానించి పూలబొకేలతో సత్కరించి అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో పీఈటీలు పాప, కనకమహాలక్ష్మి, ఉపాధ్యాయుడు గోవిందనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బాక్సింగ్ అసోషియేషన్ కార్యవర్గం ఎంపిక


కొత్తగా ఎంపికైన బాక్సింగ్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులతో అశోక్‌రాజు

శృంగవరపుకోట: జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు కార్యదర్శి ఇందుకూరు అశోక్‌రాజు ఒక ప్రకటనలో గురువారం పేర్కొన్నారు. విజయనగరం సిటీ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా బాక్సింగ్ అసోషియేషన్ చైర్మన్‌గా డోలా మన్మథకుమార్ అధ్యక్షుడిగా గారే శ్రీనివాసరావు ప్రధాన కార్యదర్శిగా ఇందుకూరు ప్రకాశ్ రాజులు ఏకగ్రీవంగా ఎంపికైనట్లు చెప్పారు. వారు నాలుగేళ్ల పాటు పదవిలో ఉంటారన్నారు. 45 ఏళ్ల చరిత్రకలిగిన జిల్లా బాక్సింగ్ అసోషియేషన్ నియమావళి ప్రకారం నడుచుకుని జిల్లాలో బాక్సింగ్ క్రీడాభివృద్ధికి పాటుపడతామని ఆయన తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే తొక్కిసలాట

- టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు చొక్కాపు


మాట్లాడుతున్న టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు లక్ష్మణరావు, పక్కన జెడ్పీటీసీ సరస్వతి

రామభద్రపురం: తిరుమలలో వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీలో తొక్కిసలాటకు కూటమి ప్రభుత్వంతో పాటు టీటీడీ పాలక మండలి వైఫల్యమే కారణమని టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు ఆరోపించారు. వైఎస్సార్ సీపీ స్థానిక కార్యాలయంలో జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతితో కలిసి గురువారం ఆయన మాట్లాడారు. టీటీడీ చరిత్రలో కనీవినీ ఎరుగని విషాదం చోటుచేసుకుందని, గతంలో ఇటువంటి ఘోరాలు ఎన్నడూ జరగలేదన్నారు. టీటీడీ నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గతంలో టీటీడీ పవిత్రతను కాపాడినట్లు ఎవరూ చేయలేదన్నారు. తొక్కిసలాటపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు డర్రు పైడిరాజు ఉన్నారు.

వాడీవేడిగా మండల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సన్యాసినాయుడు

మెంటాడ: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అధ్యక్షతన గురువారం వాడీవేడిగా జరిగింది. సమావేశంలో ఇద్దనవలస సర్పంచ్ రాయిపల్లి రామారావు మాట్లాడుతూ వెండర్ విధానాన్ని అమల్లోకి తెచ్చిన కూటమి ప్రభుత్వం సర్పంచ్‌ల అధికారాలు, విధులకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తుందని ధ్వజమెత్తారు. ఈ విధానంలో టీడీపీ నాయకులకు పనులు కట్టబెట్టేలా ఆదేశాలు జారీ చేయడం శోచనీయమన్నారు. దీని వల్ల మండల వ్యాప్తంగా రూ.6కోట్లతో 126 పనులను చేపట్టడానికి ప్రతిపాదనలను సిద్ధం చేయగా ఇప్పటి వరకు రూ.42లక్షలకు సంబంధించి 32 పనులు మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. పనులు నత్తనడకన ఎందుకు సాగుతున్నాయని పీఆర్ జేఈఈ గౌతమ్‌ను ఎంపీపీ ప్రశ్నించారు. పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు ఎరువుల పంపిణీకి ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని ఏఓకు ఎంపీపీ సూచించారు. వైస్ ఎంపీపీ సారికి ఈశ్వరరావు, ఎంపీడీఓ భానుమూర్తి పాల్గొన్నారు.

రాష్ట్రంలో కూటమి దుష్టపాలన

- వైఎస్సార్ సీపీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్


మాట్లాడుతున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం : రాష్ట్రంలో దుష్ట పాలన సాగుతోందని, ప్రజల ప్రాణాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని వైఎస్సార్‌సీపీ రాజాం ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ మండిపడ్డారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం వద్ద జరిగిన తోపులాట ప్రమాదానికి పూర్తి బాధ్యత కూటమిదేనని ఆరోపించారు. తొక్కిసలాటలో ఏడుగురు భక్తులు మృతి చెందడంతో పాటు 40 మందికి పైగా భక్తులు గాయాల పాలైన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని వెల్లడించారు. ఇటువంటి ఘటన టీటీడీ చరిత్రలో లేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో విపత్తులు, మానవ తప్పిద ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. తితిదే తొక్కిసిలాటలో చనిపోయిన బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందించడంతో పాటు ఆయా కుటుంబాల్లోని యువతకు టీటీడీలో ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో పాటు హోంమంత్రి, టీటీడీ చైర్మన్, సంబంధిత అధికారులు బాధ్యత వహిస్తూ తమ పదవులకు, ఉద్యోగులకు రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ రాజాం పట్టణ, రూరల్ అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, డాక్టర్ నరేంద్ర, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల నమూనాల సేకరణ


ఎరువుల నమూనా సేకరిస్తున్న ఏఓ శిరీష

బాడంగి: స్థానిక రామలక్ష్మి రైతు డిపోలో ఎరువుల నాణ్యతను పరిశీలించేందుకు ఏఓ కె.శిరీష నమూనాలు గురువారం సేకరించారు. ఎరువుల దుకాణంలో నిల్వలున్న ఎరువులు ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యత ఉన్నదీ.. లేనిదీ పరిశీలిస్తామన్నారు. మండలంలో ఎరువుల కొరత లేకుండా డీలర్లతో తెప్పిస్తున్నామన్నారు. ఖరీఫ్ వరి దిగుబడులను 85 శాతం మేరకు ఇప్పటికే కొనుగోలు కేంద్రాల సేకరించామని తెలిపారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి

- కేజీ నుంచి పీజీ వరకూ విద్యా సంస్థలు
- విద్యా, వ్యాపార, వాణిజ్య రంగాల్లో నూతన ఒరవడి
- హోటల్ రంగంలో అధునాతన వంటకాలు, వినూత్న రుచులు
- నూతనంగా ఆర్డీఓ కార్యాలయంతో మరింత గుర్తింపు


బొబ్బిలిలోని అతిథి గృహం

బొబ్బిలి: దేశ వ్యాప్తంగా చారిత్రక, కళారంగాల్లో గుర్తింపు పొందిన బొబ్బిలి ఇప్పుడు వ్యాపార, వాణిజ్య, విద్యా రంగాల్లో ఇతర పట్టణాలు, జిల్లా కేంద్రాలతో అభివృద్ధిలో పోటీ పడుతోంది. పంచాయతీ నుంచి గ్రేడ్-1 మున్సిపాలిటీగా ఎదిగిన తరువాత అంచెలంచెలుగా బొబ్బిలి అభివృద్ధి చెందుతోంది.

ప్లే స్కూల్స్ నుంచి పీజీ, ఇంజనీరింగ్ దాకా..

బొబ్బిలి పేరు చెబితేనే రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి ఇక్కడకు వచ్చి చదువుకునేలా విద్యాలయాలు ఇక్కడి ప్రత్యేకం. చిన్న పిల్లల నుంచి ఆటపాటలతో విద్యను ప్రారంభించిన స్కూళ్లతో పాటు ప్రాథమిక స్థాయి, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీలు, ఇంజనీరింగ్ కాలేజీలతో పాటు ఒకేషనల్, వ్యాయామ కళాశాలలు సైతం భావి పౌరులకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్న సంస్థలెన్నో! విద్వాన్ జూనియర్ కాలేజ్, రామభద్రపురంలోని గ్లోబల్ వ్యూ సెంట్రల్ సిలబస్ స్కూల్, వాసు జూనియర్ కాలేజ్, శ్వేతా చలపతి ఇంగ్లిష్ మీడియం స్కూల్, అభ్యుదయ ఇంగ్లిష్ మీడియం హైస్కూళ్లతో పాటు ట్రిపుల్ ఎస్, షిర్డీసాయి, రాజా డిగ్రీ కాలేజ్‌లు అధునాతన కోర్సులతో విద్యాభ్యాసాన్ని అందిస్తున్నాయి.

వైద్య రంగంలో ఎన్నో అద్భుతాలు

పట్టణంలోని వైద్య రంగంలో ఎన్నో అద్భుతాలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో వివిధ పరీక్షలకు, క్లిష్టతరమైన శస్త్రచికిత్సలకు జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు పరీక్షలతో పాటు వేలాది శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. శ్రీవేణుగోపాల నర్సింగ్‌హోం, ఎన్నార్, అమ్మ, ఆసుపత్రులు వైద్య రంగంలో కొత్తపుంతలు తొక్కుతున్నాయి. సీనియర్ వైద్యులు ఆర్నిపల్లె గోపీనాథ్, గేదెల శశిభూషణ రావు, వెంకట నాయుడు, రామ్‌నరేష్‌లతో పాటు మహిళా వైద్యులు, ఎందరో సేవలందిస్తున్నారు.

వినూత్న రుచులు, విభిన్న వంటకాలతో అలరారుతున్న హోటళ్లు, దాబాలు

పట్టణంలో వైవిధ్యమైన రుచులతో రకరకాల వంటకాలతో భోజన ప్రియులను ఆకట్టుకుంటున్న హోటళ్లు ఆవిర్భవించాయి. గతంలో ఇతర రాష్ట్రాల్లో ఉండే మండీ హోటళ్లు సైతం బొబ్బిలిలో వెలిశాయి. ఇడ్లీ నుంచి బిర్యానీ వరకూ, మటన్ నల్లీఘోష్ దమ్ బిర్యానీ వరకూ,నాటుకోడి పులుసు-రాగిసంకటి నుంచి తందూరీ చికెన్ వరకూ ఒకటేమిటి? ఎన్నో రకాలు ఇప్పుడు స్టార్ మండీ తదితర హోటళ్లలో లభిస్తున్నాయి. కాకా హోటల్ నుంచి ఏసీ హోటల్స్ వరకూ ఇప్పుడు సందర్శకులతో కిటకిటలాడుతున్నాయి. గుషిణి రామారావు అండ్ సన్స్ ఆధ్వర్యంలోని దాబా, మండీ హోటళ్లకు భోజన ప్రియులు క్యూ కడుతున్నారు.

బొబ్బిలి వీణకు మరింత విలువ!


బొబ్బిలి వీణలు

పట్టణానికి కూతవేటు దూరంలోని గొల్లపల్లి వీణల కేంద్రంలో బహుమతుల వీణలు, ప్రొఫెషనల్ వీణల తయారీలో సుమారు 23 మంది కళాకారులు తమ నైపుణ్యాన్ని రంగరించి వివిధ ఆకృతులతో వీణలను తయారు చేస్తున్నారు. అమెరికా అధ్యక్షుడి నుంచి భారత ప్రధానమంత్రి వరకూ, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, సినీ కళాకారులకు, మంచి జ్ఞాపికగా నిలిచిపోయే బొబ్బిలి వీణంటే ఇష్టపడని వారు లేదు. బొబ్బిలిలో లభించే ఈ వీణల కోసం వివిధ రాష్ట్రాలు, దేశాల ప్రజలు ఆసక్తి ప్రదర్శిస్తారంటే అతిశయోక్తి కాదు.

సినిమాల్లో గెస్ట్ హౌస్, కోటల అందాలు

పట్టణంలోని రాజుల కోట, యుద్ధ స్థంభం, గెస్ట్ హౌస్‌లు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. వీటిని సందర్శించేందుకు సుదూర తీరాల నుంచి ప్రజలు వస్తుంటారు. కోటలో అలనాటి ఆయుధాలు, చిత్రాలు, జంతువుల కళేబరాలు, పాత కాలం నాటి వాహనాలు ఆకట్టుకుంటాయి. అందుకే ఇక్కడ పలు తెలుగు, తమిళ చలన చిత్రాలు రూపుదిద్దుకుంటున్నాయి.

నూతనంగా ఆర్డీఓ కార్యాలయం

డివిజన్ కేంద్రం కోసం ఎన్నో సంవత్సరాల నుంచి కలలుగంటున్న ప్రజలకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో డివిజన్ కేంద్రాన్ని మంజూరు చేశారు. అంతే కాదు. అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ, అప్పటి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నేటి జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుల చేతుల మీదుగా ప్రారంభమయిన ఈ ఆర్డీఓ కార్యాలయం ప్రజలకు ఎన్నో సేవలందిస్తోంది. అంతే కాదు జిల్లాలో కీలకమయిన గిరిజన యూనివర్సిటీకి ఇక్కడి నుంచే సుమారు 520 ఎకరాలకు పైగా భూములను సేకరించి యూనివర్సిటీ నిర్మాణానికి పునాదులు వేశారు.

ఆటోమొబైల్ రంగంలోనూ జోరు

బొబ్బిలిలో గతంలో వివిధ వాహనాలు కొనుగోలు చేయాలంటే జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిందే! కానీ ఇప్పుడు అన్ని రకాల బైక్ షోరూంలు వెలిశాయి. అలాగే కార్ల షోరూంలు కూడా అందుబాటులోకి వచ్చాయి. తక్కువ వడ్డీరేట్లతో కొనుగోలుదారులకు అవసరమయిన రుణవాయిదాలను కూడా అందజేస్తున్నారు.

విస్తరిస్తున్న రియల్ ఎస్టేట్

బొబ్బిలి పట్టణంలో రియల్ ఎస్టేట్ బాగా విస్తరిస్తోంది. వీధికో రియల్టర్‌లున్నారు. సులభ వాయిదా పద్ధతుల్లో ఇండ్ల స్థలాలు, ఇళ్లు, విల్లాలు, అపార్ట్‌మెంట్లను కొనుగోలు చేయడానికి వీరు సహాయపడుతున్నారు. వీరి ద్వారా కొనుగోలు చేసే స్థలాలు, ఇళ్లకు భవిష్యత్తులో మరింత ధర పెరిగి అటు వినియోగదారులు, కొనుగోలుదారులు కూడా ప్రయోజనాలు పొందుతున్నారు.


కొత్తగా వెలసిన స్టార్ మండీ హోటల్


గ్లోబల్ వ్యూ సెంట్రల్ సిలబస్ విద్యాసంస్థ


విద్వాన్ జూనియర్ కాలేజ్



ఆధ్యాత్మిక నిలయం.. శ్రీమద్రామాయణ ప్రాంగణం


శ్రీమద్రామాయణ ప్రాంగణం


నారాయణం శ్రీనివాస్

విజయనగరం: 'రాముడే నా శ్వాస - శ్రీరామాయణమే నా భాష' అన్న సూక్తితో విజయనగరం మండల పరిధిలోని శ్రీమద్రామాయణ ప్రాంగణం ఆధ్యాత్మిక నిలయంగా వెల్లువిరుస్తోంది. రామాయణంలోని విలువలను భావి భారత పౌరుల జీవన విధానంలో భాగం చేయడం, ఇతిహాసాలలోని అద్భుత జ్ఞానాన్ని విద్యావ్యవస్థలో భాగం చేయచ్చు అని ఎలుగెత్తి చాటడంలో ఈ క్షేత్రం ఆదర్శప్రాయంగా నిలుస్తోంది. ఇదే ప్రాంగణంలో ప్రపంచంలోనే వాల్మీకి రామాయణంపై మొట్టమొదటి పరిశోధన కేంద్రమైన వాల్మీకి రీసెర్చ్ సెంటర్ ఆన్ రామాయణ'ను ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు జాతికి అంకితం చశారు. వాల్మీకి రామాయణంపై పరిశోధనను చిన్నతనం నుంచి ప్రోత్సహించి దానిలోని విలువలను భావితరాలకు రుచిచూపించడంతో పాటు ఆరోగ్యమైన, ఆదర్శవంతమైన సమాజాన్ని నిర్మించాలన్నదే పరిశోధన కేంద్రం ముఖ్య లక్ష్యం. ఈ పరిశోధనా కేంద్రం వాల్మీకి రామాయణంపై ఎందరో మహానుభావుల మార్గదర్శకంతో, ''శ్రీ రామాయణ శంఖారావం'' అన్న ఒక మహా సదస్సుతో తన ఆవిర్భావాన్ని చాటుకుంది. 'ఇంటర్నేషనల్ యూత్ కన్‌క్లేవ్ ఆన్ రామాయణ' పేరిట జనవరి 24 నుంచి 26 వరకు రామనారాయణ ప్రాంగణం 'వాల్మీకి రీసెర్చ్ సెంటర్ కేంద్రంగా' లో ఈ మహాసదస్సు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు నారాయణం శ్రీనివాస్ తెలిపారు. ప్రపంచంలో ఎక్కడ నుంచి అయినా ఎవరైనా దీనిలో భాగస్వాములు కావచ్చని పేర్కొన్నారు. ఈ మహా సదస్సులో పాల్గొనదలచిన వారు రామాయణంలోని ఏదో ఒక అంశం ఎంచుకొని దాని మీద ఒక వ్యాసాన్ని రాసి పంపించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం సెల్: 93470 66622/82969 44982 నంబర్లను సంప్రదించాలని కోరారు. ఈనెల 20వ తేదీలోగా వ్యాసాలను 'వారధి2025ఎట్‌దిరేట్‌ఆఫ్‌జిమెయిల్‌డాట్‌కామ్' మెయిల్‌కు పంపించాలని వివరించారు.

తిరుపతి ఘటనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణం

- కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్రీనివాసరావు

బొబ్బిలి: తిరుపతిలో జరిగిన దారుణ తొక్కిసలాటకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మువ్వల శ్రీనివాసరావు అన్నారు.

గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ విశాఖపట్నం పర్యటనకు వస్తే 5వేల మంది పోలీసులతో భద్రత కల్పించారని, అదే తిరుపతిలో టోకెన్ల జారీ విషయంలో మాత్రం కనీస భద్రత లేకుండా చేశారని ఆయన విమర్శించారు. వేలాది మంది భక్తులకు ఐదుగురు పోలీసులను ఉంచడం ఎంతవరకూ సబబన్నారు.

ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం వలన చనిపోయిన వారి కుటుంబాలకు రూ.50లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు. క్షతగాత్రులకు రూ.5లక్షలు చొప్పున ఇవ్వాలన్నారు. ప్రజలన్నా, వారి ప్రాణాలన్నా ఇంతటి నిర్లక్ష్యం పనికిరాదన్నారు.

సందడిగా సంక్రాంతి వేడుకలు


బొబ్బిలి రూరల్: నారశింహునిపేట జెడ్పీ స్కూల్‌లో భోగి మంటల చుట్టూ విద్యార్థుల నృత్యాలు

సంక్రాంతి పండగ రానే వచ్చేస్తోంది. పాఠశాలలకు శుక్రవారం నుంచి సెలవులు ప్రకటించడంతో చివరి రోజు గురువారం పలు పాఠశాలల్లో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. భోగి మంటలు వేసి సందడి చేశారు. సంక్రాంతి ముగ్గులతో విద్యార్థినులు అలరించారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. మొత్తంగా సంక్రాంతి వేడుకల వేళ పాఠశాలల్లో విద్యార్థుల సందడి చేశారు. - సాక్షి నెట్‌వర్క్


రాజాం సిటీ : బొద్దాం స్కూల్‌లో భోగి మంటలు


రామభద్రపురం: బూసాయవలస కేజీబీవీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న విద్యార్థినిలు,టీచర్లు


తెర్లాం: వెలగవలస హైస్కూల్ ఆవరణలో వేసిన భోగి మంటలు